# పీడకథ

**ఒ**క్కోడి కొక్కోపిచ్చి, సీతారామయ్యకు చిన్నప్పణ్ణించీ కథల పిచ్చి. బళ్ళో చదువుకునేటప్పుడు శనాది వారాలకోసం తహతహ లాడేవాడు. శనాది వారాలు రాగానే కథల పుస్తకాలూ, పత్రికలూ, దొరికినన్ని చేర్చి, ఇంకో పనిలేకుండా చదివేవాడు.

మనస్తత్వంలో మనం సాధారణంగా గమనించే అంశం ఏమంటే, ఏది మనకు ఉద్రేకంతో కూడిన ఆనందం ఇస్తుందో, అదీ దానికి కారణభూతులైన వాళ్ళూ మన దృష్టికి అమానుషంగా భగవదంశ సంభూతంగా కనిపిస్తారు. అప్పుడు మనలో ఆరాధన పుట్టుకొస్తుంది. దీనికి తార్కాణం ప్రియురాలు. ఇతర కంఠస్వనాలూ, ఇతరుల దర్శనమూ ఇవ్వలేని ఆనందం ప్రియురాలి గొంతూ, ప్రియురాలి ఆకృతీ ఇస్తుంది. అందుచేత ప్రియురాలిలో ప్రియుడికి దేవాంశ కనిపిస్తుంది.

సీతారామయ్యకు కథకుల్లో ఇటువంటి అంశే కనిపించేది. అయితే సీతారామయ్యకూ కవికాముకుడికీ ఉన్న తేడా ఏమిటంటే, కవికాముకుడు తన ప్రణయ గీతాలు పట్టుకుని చచ్చేదాకా వేళ్ళాడతాడు. అవి తుక్కు అన్నవాణ్ణి తిట్టిపోస్తాడు. తుచ్ఛమైన తన కీర్తిని అనేక వేదికల మీదినించి చాటుతాడు. సీతారామయ్య అట్లా కాదు. అతను కథకుల్ని ఆరాధించినంతకాలము ఆరాధించి ఆఖరుకు ఒక శుభసమయాన చదువుకున్న పత్రిక నేలకేసి కొట్టి, "ప్రెతీవెధవా కథ వ్రాసేవాడే!" అని చీదరించుకున్నాడు.

ఆ ముహూర్తాన ఒక సామాన్య వ్యక్తి, ఒక అనామకుడు, ఆఖరుకు నవ్య సాహిత్య పరిషత్తు సభ్యత్వం కూడా ఎరగని ఒక "కోన్-కిస్కాహై"గాడు, నవ్య సాహిత్య పరిషత్తు కూడా శీతకన్నేసిన కథా సాహిత్యం మీద విప్లవం చేశాడు.

"ప్రెతీవెధవా కథ్రాసేవాడే!" అనే తృణీకారభావం ఎప్పుడైతే కలిగిందో అప్పుడే సీతారామయ్యకు, "నేనే కథ ఎందుకు రాయగూడదు?" అనిపించింది.

తానే కథ రాయాలనే లోకోత్తరమైన అభిప్రాయం సీతారామయ్యకు కలగటం ఎంతో మేలయింది. లేనిపక్షంలో ఈపాటికి సీతారామయ్య ఆధునిక తెలుగుకథా సాహిత్యం మీద విప్లవం సాగించి సాహిత్య లెనినో, సాహిత్య స్టాలినో, అయి కూర్చుని ఉండును.

"నేనీ వెధవలపాటి రాయలేకపోను!" అనుకున్నాడు సీతారామయ్య. అప్రయత్నంగా అతనికి "ఆ వెధవల" పక్షాన పుట్టుకొచ్చిన క్రోధాగ్ని దోవతప్పి ఎటో మారుపడిపోయింది. సీతారామయ్య తీవ్రంగా కథను గురించి ఆలోచన మొదలు పెట్టాడు.

అందుబాటులో ఉండాలేగాని, కథ గురించి ఆలోచించటానికి ఈజీచైరంటిది మరొకటి లేదు. దానికితోడు తలకింద చిన్న దిండూ, కాళ్ళు ఎత్తుగా పెట్టుకోవటానికి ఎత్తయిన స్టూలుగాని, ఇంకో కుర్చీగాని ఉంటే మరీ మంచిది. అదే రాత్రిపూటనయితే ఆవలింతలు రావటం ప్రారంభమయ్యే వేళకు దీపం తగ్గించేసి, ఆలోచించేవాడి తత్వానికి అనుకూలంగా కుడిపక్కకో, ఎడం పక్కకో ఒత్తిగిలి పడుకుని ఆలోచిస్తే మంచిది.

అదృష్టవశాత్తూ సీతారామయ్య దగ్గిర ఒక పడక్కుర్చీ ఉంది. సీతారామయ్య అందులో నడుంవాల్చి తను రాయబొయ్యే కథను గురించి తీవ్రంగా ఆలోచించసాగాడు.

త్వరలోనే అతని తల ఒక పక్కకు ఒరగబడిపోయింది. అతని కుడిచెయ్యి తలవెనుక దిండుగా పనిచేస్తున్నది. అతని ఎడంచెయ్యి గుండెమీద విశ్రాంతి తీసుకుంటున్నది. ఆలోచనా సమాధి సమగ్రంగా ఏర్పడింది.

"నేను పనికొస్తాను, నన్నుపయోగించుకో!" అన్నాడు ఎదురుగుండా ఉన్న వ్యక్తి.

"ఎవరు నువు?" అన్నాడు సీతారామయ్య.

"నన్నెరగవా? నేను పాప్యులారిటీ వోటుపొందిన కథానాయకుణ్ణి!"

"నీకు వోటిచ్చినవారెవరు? కథలు చదివేవాళ్ళేనా?"

"చదివేవాళ్ళ దగ్గిర ఎవరన్నా వోటు తీసుకుంటారా ఏమిటి? నేను రాసేవాళ్ళ వోట్లూ, ప్రకటించేవాళ్ళ వోట్లూ పొందాను."

"ను వెవరన్నాను. నీ కులమేమిటి, గోత్ర మేమిటి? నీ ఆస్తెంత? నీకేం పని? నువు కాంగ్రెసువాడివా? ముస్లింలీగువాడివా? నీ రాజకీయ సిద్ధాంత రాద్ధాంతాలేమిటి? ఏమీ తెలీకుండా నిన్నెట్లా ఉపయోగించను?"

కథానాయకుడు నవ్వాడు.

"నీకు కథలు రాయడం బొత్తిగా చాతకాదల్లే ఉంది. నా జీవిత చరిత్ర రాసే వాడల్లే మాట్లాడుతున్నావే. నా జీవితంలో ఒక్క సంఘటన గీకి అవతలపారేసి గొప్ప కథకుడై పోవటానికి నా కుల గోత్రాలడుగుతావేమి టెక్కడో?"

"నిన్ను గురించి ఏమీ తెలియక్కర్లేకుండా రాయదగిన నీ జీవిత సంఘటన ఏముంటదబ్బా!"

"ఒక ప్రణయఘట్టం రాసెయ్యవోయ్ - ఝూంసేపు తర్కించకా!"

"నీ ప్రణయంతో నీ సంస్కారానికీ, ఆస్తికీ, నీ ఉద్యోగానికీ ఏమీ సంబంధం లేదా ఏమిటి?"

"నన్నెటూగాని వేళ నవ్వించకు. అర్ధరాత్రివేళ ఆ తోటలో –"

"ఏ తోటలో?"

"ఏదో తోటలో! నీకు సంబంధించని విషయాలు కెలక్కు.. ఆ తోటలో నేను, ఆమె నాకు దక్కదని నిరాశ చేసుకుని పచారు చేస్తుండగా, చీకట్లో మెరుపల్లే నా దగ్గిర వాలి, నన్ను తన బాహువుల్లో పెనేసి నా ఒళ్లో వాలిపోవటానికి నే నెవ్వణ్ణయితే నీకేం!"

"మాట వరస కడుగుతున్నాను. ఆవిడెవరు?"

"బాగుందే? నాకుమటుకేం తెలుసూ? ఆవిడా నా మాదిరిగానే చాల అందగత్తె. అంతకన్న నీకేం కావాలి?... కొంపతీసి చలంగారల్లే నాకు రోగాలూ రొష్టూ పెట్టకు. నే నింతమందిని వశం చేసుకున్నాగాని, నాకా మేళం మాత్రం తటస్థపళ్ళేదు. కనక దయవుంచి – వెంటనే నా కథరాసి నీ వోటు కూడా నాకు పారెయ్?"

"ఆ మాటలో అర్థంలేదు. వోట్లు నా కోసమా? జనసామాన్యం కోసంగాని! జనసామాన్యానికి నా కథలే కావాలి. నీకు డెమోక్రసీలో ఏమన్నా విశ్వాసం ఉంటే, నీ వోటేదో నాకే తగలెయ్!"

" 'కావాలి' అనే మాటను చాలా దుర్మార్గంగా ఉపయోగిస్తున్నావు. వాళ్లు నీ కథలు కోరుతున్నారు. వాళ్ళకు కావలసిందేమిటో వాళ్ళకు తెలీదు. నన్నాటే వేధించక ఇకపద.... తరవాత వాళ్ళెవరో ముందుకు రండి" అని అతన్ని వెళ్ళగొట్టాడు.

ఒక ఆడమనిషి ముందు కొచ్చింది.

"ఇందాక నీతోమాట్లాడిన వెధవతో నువు చలంగారిమీద అభిమానం ఉన్నట్టు మాట్లాడావు. నన్ను గురించి కథరాయి" అన్నదావిడ తన వొంపులన్నీ ప్రకటిస్తూ.

"ఎవరు నువు?"

"నే నెవరేమిటి? నేనే సుందరమ్మను, చుక్కమ్మను, అరుణను, మాదిగమ్మాయిని, 'కా'ను, 'చా'ను, 'జా'! తెలిసిందా?"

"ఏం చేస్తావు నువు?"

"రకరకాల మగవాళ్ళకి స్వర్గం చూపిస్తాను. నన్ను ప్రేమించనిస్తాను. నా కోసం యాడవనిస్తాను. నా కోసం పిచ్చెత్తనిస్తాను. నా వొంపులు నివిదీర చూడనిస్తాను."

"న్నువేం చేస్తావని అడిగాను."

"న్నేనా?" ఆలోచించింది "నేనూ ప్రేమిస్తాను."

"ఎవర్ని?"

"నిలదీసి అడక్కు. ఆడది అనేక మందిని అనేక విధాలుగా ప్రేమిస్తుంది. అందుట్లో కథకుణ్ణి మాత్రం కొంచెం ప్రత్యేకంగా ప్రేమిస్తుంది."

"మధ్య కథకుడెవడు?"

"కథకుడంటే కథానాయకుడన్నమాట. పోనీ నీ యిష్టం. నన్ను చూస్తే భయమైతే నువు పాత్రవుగా వుండకు. నా కెట్లాగైనా ఒకటే."

"ఇంతమందిని ప్రేమిస్తే ని న్నెవరూ తన్నరూ?"

"నన్నా? నన్నా! న న్నారాధిస్తారు నా కోసం ఏడుస్తారు. నా కోసం కుక్కలల్లే- "

"నిన్ను తన్నేటంత నిర్లిప్తుడుండడా" అని అడిగాను. "నీ భర్త –"

"వెధవ? నన్ను సుఖ పెట్టలేదు. తన్నగలడా?"

"అది చాతకాక, ఇది చాతైన వాళ్ళు లేకపోలేదు. నీ మాట కాదన్నందుకు క్షమించు."

"నన్నెవరూ తన్నరు. నే నాజాతి కాదు. ఆ జాతివాళ్లు వేరే ప్రచారానికి!"

"పిచ్చిదానా, ఎవణ్ణి ఎవడైనా నడివీధిలో జుట్టుపట్టుకుని తన్నవచ్చును. నీ వంటిదాన్ని నిన్నారాధించేవాళ్ళే తన్నవచ్చును."

ఆవిడ కళ్ళు ఆగ్రహంతో మెరిసినై.

"ఎవడ్రా నువూ? నీ చచ్చు బొక్కు తెలుగాడవాళ్ళతో మాట్లాడినట్టు నాతో మాట్లాడతావా? నే నెవతె ననుకున్నావు? మొపాసా, వెల్స్, మైకేల్ ఆర్లెన్ మొదలైన వాళ్ళ తలల్లోంచి ఊడిపడ్డదాన్ని తెలిసిందా? ఒళ్ళు దగ్గిర పెట్టుకు మాట్లాడు."

"అదా నీ రహస్యం? అయితే పద, పేం చెయ్యి. నేనంత సుప్రసిద్ధుణ్ణి కాను. వెనుక ఎవరో రండి!"

ఇద్దరు దంపతులు ముందుకొచ్చారు.

"మీరిద్దరూ భార్యాభర్తలా?"

"అవును, మేం హరిజనులం. మేం పొలం పన్లూ, తోటపన్లూ అవీ చేస్తూంటాం. లోకం మమ్మల్ని అస్పృశ్యులనుగా చూసి ఎడతెగని పాపం అంటగట్టుకోవటమే కాకుండా, మా మీద దారుణమైన అత్యాచారాలు చేస్తున్నది."

"మీరు చదువుకున్న హరిజనులా?"

"కాదు. మాకు చదువెట్లా వస్తుంది? ఎవరు చెప్పిస్తారు? మమ్మల్ని గుళ్ళల్లోకే పోనివ్వరే. బళ్ళల్లోకి రానిస్తారా?"

"మీకు గుళ్ళోకి పోవాలని ఉందా?"

"ఉండదా?"

"దేనికీ?"

"మీరంతా పోరా?"

"నేను బుద్ధెరిగి గుళ్ళోకి పోలేదు. ఎప్పుడన్నా తిరణాలకు పోతాను. అక్కడ ఆ జనసమ్మర్దంలో – అదంతా మీ కనవసరం. ఇంతకూ అసలు సంగతేమిటంటే, మీరింత స్వచ్ఛంగా ఎట్లా మాట్లాడుతున్నారు? మీకు కొంత సంస్కారం ఉన్నట్టు కనబడుతుందే, అదెక్కడిది?"

"మీ కథలు రాసేవాళ్ళ సంస్కారమే మాదిన్నీ. మీకు ప్రతిష్ఠ తేవటానికి మేంగాని, మాకు వారిగేదేముందీ?"

"బాగానే ఉంది. అయితే మీ కథ ఏమిటి?"

"కథేముందీ? మేమిద్దరమూ ఎంతో ప్రేమతో – "

"ప్రేమా?"

"అవును, ప్రేమే! మేం మనుషులం కామా? మాకు హృదయములు లేవా? మమ్ము భగవంతుడు ప్రత్యేకించి సృజించెనా?"

"కోప్పడకు, కోప్పడకు! ఈ భాగ్యానికి గ్రాంథిధికం దేనికి?"

"ఉద్రేకం జాస్తి అయినప్పుడు వాడుక భాష చాలదు. ఇట్లా అడ్డపుల్లవేస్తే కథ సాగదు మరి."

"కానీ, కానీ! అడ్డంరాన్లే. చెప్పు!"

"మేమంత అన్యోన్యంగా ఆ గుడిసెలో కాపురం చేస్తుంటే, ఇంతలో నాకు జబ్బు చేస్తుంది. నేనొకపూట నడుం వాలుస్తే ఇంటో గంజి నీళ్లుండవుగా? ధనమదాంధులైన ఎక్కువ జాతివారికి మా దారిద్ర్యం పడుతుందా? వారి కాఫీలేమో. వారి సినిమాలేమో, వారి చీనిచీనాంబరాలేమో, వారి తాగుళ్ళేమో–"

"నువు కమ్యూనిస్టువు కూడానా?"

"భాగ్యవంతులను చూసి అసూయపడేవాడు కమ్యూనిస్టు. నేను భాగ్యవంతులను చూసి జాలిపడతాను. మావంటి దరిద్రులే మంచివాళ్ళు. మేమే హరిజనులం. ప్రపంచమంతా దరిద్రులే ఉంటే, పాపాత్ములుండరు. నేను కమ్యూనిస్టునా? పాపం శమించుగాక! నాది గాంధీ తత్వం.... మళ్ళీ అడ్డొస్తున్నావు!.... నేనా విధంగా జబ్బు పడి ఉంటే నా భార్య, ఎంతో అభిమానవతి, తగని పతివ్రత. ఆ అర్ధరాత్రివేళ ఆ వానలో –"

"అది వానా కాలమా?"

"నీకు కథలు రాయటం చాతకాదల్లే ఉందే?"

"నువ్వా కనుక్కున్నావూ? ఏమిటా తిరుగుడు?"

"బయట వానా, ఉరుములూ, మెరుపులూ, హోరుమనిగాలి, గుడిసెలో మినుకు మినుకు మంటూ ఆరిపోజూస్తున్న గుడ్డి దీపమూ - అది నా ప్రాణానికి చిహ్నంలే! - ఇదంతా ట్రాజెడీకి ఎటువంటి ఎట్మాస్ఫియర్!"

"ఓహో! తెలిసింది, తరవాత?"

"తరవాత నా భార్య. తగని పతివ్రత-"

"అదంతా చెప్పావు."

"నీ నస చూస్తే నాకు మండిపోతున్నది. నా భార్య చంటిపిల్ల వాణ్ణి చంకనేసుకుని – "

"ఓ చంటిపిల్లాడు కూడానా?"

"వాడు భగవంతుడి స్వరూపం. జరగబొయ్యే పాపకృత్యానికి వాడే సాక్షి. చంటిపిల్లాణ్ణి చంకనేసుకుని ఆ వానలో పడి మా యజమాని యింటికి పోతుంది. మా యజమాని తప్పతాగి ఒంటరిగా ఉంటాడు."

"ఒంటరిగా ఏం ఖర్మం?"

"అదంతా నన్నడక్కు. భాగ్యవంతులు వాళ్ళకేం? వందమంది నింటోపెట్టుకున్నా, ఉన్నవారిని వెళ్ళగొట్టినా వారికి చెల్లుతుంది. నా గుడిసెలో నేను ఒంటరిగా ఉండటానికి లేదే. ఓ రాత్రివేళ నా గుడిసెలోకి ఏ దొమ్మరదాన్నన్నా చేర్చటానికి లేదే-"

"నా భార్యను చూడగానే మా యజమానికి కామోద్రేకం కలుగుతుంది. తడిసిన బట్టల్లోంచి తళతళా మెరిసే దానిదేహం, ఆ దేహం తాలూకు వొంపులూ-"

"ఆ వొంపులు కాస్త సరిచెయ్యిబాబూ! అన్నట్టు నీ భార్య ఒళ్ళు తళతళా మెరవాల్సిన అవసరం ఏముందీ? నల్లగా ఉండదూ?"

"పోనిస్తూ! నువ్వెక్కడో విమర్శకుడల్లే ఉన్నావుగాని, కథకుడల్లే లేవు. నలుపు సరుకులో నాణెము లేదా? వార్నిష్ చేస్తే చంద్రకొయ్య మెరవదూ?.......... ఆ దుర్మార్గుడు, ఆ ధనమదాంధుడు మోహావేశపరవశుడై నా భార్యను గవయబోవ నాయమ సంభ్రమము చెందియుండ చంకలోని కుర్రడు కెవ్వన నార్చి......."

"అదంతా నేను రాస్తాను. నువు టూకీగా కథ చెప్పు."

"మా యజమాని నా భార్యను చెరిచేస్తాడు. ఆ పసిగుడ్డు ఎదట. నా భార్య శరీరంతాలూకు వెచ్చదనం వాడి శరీరాన్ని మరింత మత్తెక్కిస్తుంది. దాని పటువైన రొమ్ములు వాడి రొమ్ముకు అదుముకుని, దాని నునుపైన తొడలు-"

"ఈ దిక్కుమాలిన వర్ణనంతా దేనికీ? నా కాడదాని గొడవే తెలీదనుకున్నావా ఏం? తరవాత?"

"అక్కడ నా భార్యకు మానభంగం అయే ముహూర్తాన ఇక్కడ దీపం ఆరిపోతుంది. నేను మరణిస్తాను. యజమాని నా భార్యను పట్టుకులాగటంలో పిల్లవాడు కిందపడి చచ్చిపోతాడు. యజమానిచేత పాతివ్రత్యం కోల్పోయి నా భార్య గుడిసెకు వచ్చి నా శవంచుట్టూ ప్రదక్షిణం చేసి, పోయి బావిలోపడి మరణిస్తుంది."

"సరే, దోషగుణం తగిలి మీ యజమాని మరణిస్తాడు. క్షమించు నీ కథ నా కొద్దు. నువు వెళ్ళేటప్పుడు నీ తరవాత మనిషిని పంపించు."

❀ ❀ ❀ ❀ ❀

ఈ వ్యాపారం సీతారామయ్య కంత కంతకూ రక్తిగా కనిపించసాగింది. ఏ కథకుడూ ఇంతవరకు పాత్రలతో మాట్లాడినట్లు అతనెరగడు. తను ఎన్నడూ మామూలు వ్యక్తులతో ఇంత తెలివిగా మాట్లాడి ఉండలేదు. మామూలు మనుషులతో మాట్లాడ్డం కన్న పాత్రలతో సంభాషించటం చాలా తేలిగ్గా ఉంది.

ఒక్కసారిగా అయిదారుగురు వ్యక్తులు, స్త్రీ పురుషులు తోసుకుంటూ లోపలికొచ్చారు.

"మీరంతా ఎవరు?" అన్నాడు సీతారామయ్య.

"మేం యథార్థవ్యక్తులం?" అన్నాడు వాళ్ళ ప్రతినిధి.

"అంటే-ఇటీవల బయలుదేరిన యథార్థ వాదంతో మీకేమన్నా సంబంధం ఉందా? ఎందుచేతనంటే ఈ యథార్థవాదం నాకు స్పష్టంగా అర్థంకాలేదింకా. యథార్థమనే వీల్లేనిది రాస్తున్నారు. ఉన్నదే రాయటానికి రాత ఎందుకూ? రాయదలచుకున్న తరవాత ఉన్నదానిమీద సంస్కారం అంటూ యాడవాలిగా! పోనీ యదార్థవాదం త్యజింతామా అంటే, భావ కవులతో వేగలేకుండా ఉన్నాం. వాళ్ళు మబ్బుల్లో కూచుని జీవితంకేసి చూడకుండా ఉన్నారు. కనుక-"

"ఈ ఉపన్యాసమంతా ఏమిటి? మేం యథార్థ వ్యక్తులం, అంటే నీ పరిచితుల్లో వాళ్లం."

"నేను మిమ్మల్నెరగనే!"

"నువు నీ పరిచితుల్ని మాత్రం ఎరుగుదువా ఏమిటి?"

"కనుకనే - నువ్వెరిగున్నవారిలో ఎవరి మీదన్నా దెబ్బతియ్యాలనుకో, ఎవడన్నా నీ కథ అచ్చెయ్యలేదనుకో, ఎవడన్నా నువ్వవునన్నది కాదన్నాడనుకో, నిన్ను పోషించి

కాఫీ డబ్బులిచ్చుకునేవాడి కెవడన్నా అవమానం చేశాడనుకో. వాడి మీద తడాఖా తియ్యటానికి వాడిస్థానే మమ్మల్ని పెట్టి నువ్వో ఆట ఆడించెయ్యవచ్చు."

"తెలిసింది తెలిసింది! అదా, యథార్థ వ్యక్తులంటే? అవును చాలా ఉత్తమ కథకులూ, నవలాకారులూ, నాటకకారులూ, ఇతర కారులూ మిమ్మల్ని బాగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం నేను అనామకుణ్ని. నాకూ ఓ పేరు వచ్చి, నేనూ ఓ యింటివాణ్ణయి, నన్ను చూచి ఏడిచే దౌర్భాగ్యులుకూడా ఏర్పడ్డప్పుడు నేను తప్పక మీకు కబురు చేస్తారు. ప్రస్తుతం మీరు వేం చెయ్యవచ్చు. మీ సౌహార్దానికి నా ధన్యవాదాలు."

అకస్మాత్తుగా సీతారామయ్యకు భయంవేసింది. తనను ఇంటర్వ్యూ చెయ్యడానికి అనేకవేలమంది తయారుగా ఉన్నారనే నమ్మకం అతనికెందుకో కలిగింది. ఇంతమందితోనూ తను తెలివిగా మాట్లాడటం అసంభవం. అసలు మందిమీద ప్రయోగించేది తెలివితేటలు కానేకావు. అందుకనే రచ్చగెలిచేవాడు ఇంట గెలవలేడు. సభను ఉర్రూతలూగించేవాడు ఇవతలికొచ్చి ఒంటరిగాడికి సమాధానం చెప్పలేడు.

వెనక గిరీశం అనుకున్నట్టే సీతారామయ్యకూడా "శీఘ్రబుద్ధేః పలాయనం" అనుకున్నాడు. అతను బయటి కొచ్చాడో లేదో ఓ లక్షమంది అతన్ని చుట్టుముట్టేసి నట్టయింది. అందరూ ఒక్కసారే మాట్లాడుతున్నారు.

"మేం, పాశ్చాత్యులు కల్పించిన పాత్రలం. మమ్మల్ని ఉపయోగించు. ఎవరూ కనుక్కోర్లే... నేను కథకుణ్ణి. నన్నే పాత్రగా ఉపయోగించు. నేనంటే నువే నన్నమాట! తెలీలా? నీకు జీవితంలో ఏయే కోరికలు తీరటంలేదో అవన్నీ నీ కథల ద్వారా తీర్చుకో నా ద్వారా. నేనే నువుగా? తెలిసిందా?.... మేం పురాణ వ్యక్తులం. మమ్మల్ని గురించి కొత్త దృష్టిలో రాయి. మేం దేవతలం. మమ్మల్ని కూడా ఉపయోగించు. నీ వెధవ వాస్తవికత్వం కట్టిపెట్టు!........ మమ్మల్ని గురించిరాయి. మేం జీవిత శ్లేష్మంలో పడి కొట్టుకుంటున్న ఈగలం. మా దారిద్రమూ, మా విశ్వాసమూ, అసమర్థతా, అవినీతీ ఉన్నదున్నట్టు రాయి గొప్పవాడి వవుతావు! పైకొస్తావు! ఒట్టి నిజం లోకానికి చెప్పు! పోబోకు! రా, రా!"

సీతారామయ్య చెవులలో వేళ్ళు పెట్టుకుని పరుగెత్తసాగాడు. అప్పటికీ ఆ గొంతులు తనను వెన్నాడుతూనే ఉన్నై. ఇంకా పరుగెత్తుతున్నాడు....

❀ ❀ ❀ ❀ ❀

అంతా ప్రశాంతంగా ఉంది. సీతారామయ్య చేలమధ్య నిలబడి ఉన్నాడు. తను నిలబడి ఉన్న రోడ్డు ఏదో బస్తీకి పోతున్నది. బస్తీ దూరంగా చెట్లమీదినించి కనిపిస్తున్నది.

రోడ్డుకు ఒక పక్క ఉన్న చేలో నాట్లేస్తున్నారు. మరోపక్క కుప్పలు కొడుతున్నారు. "వొరే బూసనం," "వొసే యీరమ్మ", "వాసిరత్తీ" అని పిలుపులు మధ్య మధ్య వినపడుతున్నై.

సీతారామయ్యకు వాళ్లను చూస్తే ప్రాణం లేచివచ్చింది. కనీసం వాళ్లయినా తమ పనులు తాము చూసుకుంటున్నారు. సీతారామయ్యను ముట్టడించడానికి వాళ్ళేమీ ప్రయత్నం చేయలేదు. వెంటనే సీతారామయ్య వాళ్ళను సమీపించి, "ఏమర్రా మీ రంతా నా కథలోకి రండి" అన్నాడు.

ఒక చాపల్లాంటి కళ్ళుగల మిటారిపడుచు ముచ్చటగా మొహం చిట్లిస్తూ "యేందీ?" అన్నది.

"నువు నా కథలోకి రా!" అన్నాడు సీతారామయ్య.

"యెటకారాలా యెట్టాసి. మా అయ్యతో జెప్పి నీ తిక్కొదల గొట్టిపిత్తా! నా చంగ తెరగవ్" అన్నది.

ఆడవాళ్ళతో వ్యవహారం తేలదని సీతారామయ్య కాస్త వయోవృద్ధుడైన వాణ్ణి చూసి వాడితో తనకోరిక చెప్పాడు. "మావోటా నల్లబేపన కుర్రాయనకిచ్చేశాం. సల్లగా నీదారే నువ్వెల్లు!" అన్నాడు ముసలాడు.

సీతారామయ్య బిత్తరబోయి రోడ్డు వెంటనే బస్తీ చేరుకున్నాడు. బస్తీలో అంతా కుర్రకారు కనిపించారు. అంతా రాయిస్టులూ, సోషలిస్టులూ, కాంగ్రెసు సోషలిస్టులూ, కిసానిస్టులూ, ఒకడు 'విప్లవాన్ని జయ్' అంటున్నాడు. మరొకడు 'ఆర్థిక భౌతికతత్వం' అంటున్నాడు. చాలామంది రష్యాలో ఉన్నామనుకుంటున్నారు. కొందరు 'రష్యా పరిస్థితులకీ, ఇండియా పరిస్థితులకీ తేడా' లేదంటున్నారు. మరొకడు సక్రమమైన ఫాసిస్టు వ్యతిరేక ప్రణాళిక తయారు చేస్తేగాని, ఈ యుద్ధం సరి అయిన ఆకారం దాల్చదు, అంటున్నాడు.

వాళ్ళ మాటలన్నీ సీతారామయ్యకు అగమ్యగోచరంగా ఉన్నప్పటికీ వాళ్ళను చూస్తే ముచ్చటేసింది. వీళ్ళ అజ్ఞానాన్ని చిత్రించటమైనా చెయ్యదగినపనే ననిపించింది. కొత్త సమస్యలు కొత్త అజ్ఞానాలకు అవకాశం కలిపిస్తయి. లేని సమస్యలను గురించీ, తీరిపోయిన సమస్యల గురించీ అజ్ఞానంగా ప్రవర్తించే పాత్రలకంటె వీళ్ళు చాల నయం.

"ఏమర్రా? మీరంతా నా కథలో పాత్రలుగా ఉండరాదూ?" అన్నాడు సీతారామయ్య.

"మా సంగతి మా వాడు చూస్తాడులే. నువ్వు రాస్తే చెడగొడతావు. తమరు దయచెయ్యండి!" అన్నాడొక మనిషి.

సీతారామయ్య హతాశుడైనాడు. ఆ పొలాల్లో ప్రపంచం పని తమపనే అనే విశ్వాసంతో పనిచేస్తున్నవాళ్ళూ, ఈ ఊళ్ళో ఎవరిపని అయినా ప్రపంచం పనే అనే

విశ్వాసంతో, చేసే పనిలేక తర్జనభర్జనలు పడుతున్న ఈ కుర్రాళ్ళూ తనను నిరాకరించారు. ఇక తన జీవితమంతా తనకు కావలసిన పాత్రలను వెతకటంలో గడపాలి కాబోలు. అదుగో! ఎవరో తనను పిలుస్తున్నారు. వాళ్ళేమైనా తమ వోటిస్తారేమో! పడ్డాడు. తలకు ఏదో గట్టిపదార్థం టంగున తగిలింది...

సీతారామయ్య కుర్చీలో లేచి కూర్చున్నాడు. కుర్చీ అడ్డకర్రకు తల తగిలి కొద్దిగా నెప్పి పెడుతున్నది.

బయట ఎవరో, "సీతారామయ్యగారూ!" అని పిలుస్తున్నారు.

"ఓయ్, వస్తున్నా!" అన్నాడు సీతారామయ్య నిద్రమత్తుతో.

*ముద్రణ : వరప్రసాదం కథల సంపుటి, మే, 1946*
*యువ బుక్ డిపో, మద్రాస్*